సాక్షి
విశాఖపట్నం
బుధవారం । 13 । సెప్టెంబర్ । 2023



నీతి ఆయోగ్ సీఈవోకి స్వాగతం
విశాఖ పర్యటనకు విచ్చేసిన నీతి ఆయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యంకు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ స్వాగతం పలికారు. 8లో



పోలీస్ జిమ్ ప్రారంభం
ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్స్ ఆవరణలో ఆధునీకరించిన పోలీస్ జిమ్‌ను సీపీ డాక్టర్ సీఎం త్రివిక్రమ్‌వర్మ ప్రారంభించారు. 8లో



బడిలో ఆటల సందడి
జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం నుంచి ఈ నెల 15 వరకు మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహించనున్నారు. 8లో

న్యూస్‌రీల్

పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతి



కమిషనర్‌తో భేటీ అయిన జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు

దాబాగార్డెన్స్: పెండింగ్ బిల్లులు, ఈఎండీ, ఎఫ్ఎస్‌డీ, ఏఎస్‌డీ చెల్లింపులు జరపాలని జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం కోరింది. ఈ మేరకు అసోసియేషన్ సభ్యులు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే చెల్లింపులు జరుపుతామని కమిషనర్ హామీ ఇచ్చారని సభ్యులు తెలిపారు. నగరాభివృద్ధికి అందరం కలిసికట్టుగా పనిచేద్దామని కమిషనర్ పిలుపునిచ్చారు. అసోసియేషన్ చైర్మన్ రొంగలి జగన్నాథం, అధ్యక్షుడు గొంప చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి రంధి సాధూరావు, ఉపాధ్యక్షులు పీఏ రాజు, పీఎస్ ప్రసాద్, బి.రామానాయుడు, ఎం.సంజీవరెడ్డి, సలహాదారుడు వైఈవీ ప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శి గోవిందరావు పాల్గొన్నారు.

'చట్టానికి ఎవరూ అతీతం కాదు'



మాట్లాడుతున్న కోలా గురువులు

కొమ్మాది: చట్టానికి ఎవరూ అతీతం కాదని.. ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు రూ. 371 కోట్ల ప్రజా ధనాన్ని లూటీ చేశారు కాబట్టే జైలు పాలయ్యారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు అన్నారు. మంగళవారం ఎండాడలో గల వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు చేసిన నేరాలపై సమాధానం చెప్పకుండా ప్రభుత్వాన్ని తప్పుపట్టడం, విమర్శించడం సరికాదన్నారు. ఆర్థిక నేరాలకు పాల్పడిన చంద్రబాబును అరెస్ట్ చేయడం అన్యాయం అంటూ ప్రతిపక్షాలు ఆందోళనకు దిగడం హాస్యాస్పదంగా ఉందన్నారు. చంద్రబాబుపై కక్ష సాధించాలనే ఉద్దేశం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి లేదన్నారు. ఆయన తప్పు చేశారు కాబట్టే జైలుకు వెళ్లారని, ఈ విషయం ప్రజలందరికీ అర్థమైందన్నారు.

ఏఎంసీలో వైద్యులకు శిక్షణ



శిక్షణను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ బుచ్చిరాజు

మహారాణిపేట: ఆంధ్రా మెడికల్ కళాశాలలో రీజినల్ సెంటర్ ఫర్ మెడికల్ ఎడ్యుకేషన్ టెక్నాలజీస్(ఆర్‌సీఎంఈటీ) ఆధ్వర్యంలో వైద్యులకు మంగళవారం మూడు రోజుల శిక్షణ ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు ప్రారంభించారు. ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి 30 మంది వైద్యులు శిక్షణలో పాల్గొన్నారు. నిర్వాహక కన్వీనర్ డాక్టర్ పి.జె.శ్రీనివాస్, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

టూరిజం, ట్రావెల్ రంగాల్లో ఎక్స్‌లెన్స్ అవార్డులు

దరఖాస్తుకు ఈ నెల 19వ తేదీ ఆఖరు

మహారాణిపేట: ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని ట్రావెల్ అండ్ టూరిజం రంగంలో ఉత్తమ సేవలందించిన వారికి వివిధ విభాగాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 27న ఎక్స్‌లెన్స్ అవార్డులు ప్రదానం చేయనుంది. www.aptourism.gov.in నుంచి దరఖాస్తులు, మార్గదర్శకాలను డౌన్‌లోడ్ చేసుకోవాలి. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 19లోగా సమర్పించాల్సి ఉంటుంది. పూర్తి వివరాలకు ప్రాంతీయ పర్యాటక సమాచార కేంద్రంలో సంప్రదించవచ్చు.

ములగాడ మండల స్థాయి జేకేసీ వాయిదా

మహారాణిపేట: ములగాడలో బుధవారం జరగనున్న మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమం వాయిదా పడిందని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ఉన్నందున ఈ కార్యక్రమం వాయిదా వేశామన్నారు. ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామన్నారు.

జైళ్ల సంస్కరణలు భేష్

- ముగిసిన జైళ్ల శాఖ జాతీయ సదస్సు
- ఆరు అంశాలపై సుదీర్ఘంగా సాగిన చర్చ



బులిటెన్ ఆవిష్కరిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్



సిబ్బంది నుంచి వందనం స్వీకరిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

ఆరిలోవ: దేశంలో జైళ్ల సంస్కరణలు బాగున్నాయని.. సంస్కరణలు అమలు చేయడం, ఖైదీలకు ఆరోగ్యశ్రీ పథకం అమలు, జైళ్ల ఆధునికీకరణలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. రుషికొండలోని సాయిప్రియ రిసార్ట్స్‌లో రెండు రోజులుగా జరుగుతున్న జైళ్ల శాఖ 8వ జాతీయ సదస్సు మంగళవారంతో ముగిసింది. సదస్సులో భాగంగా స్వాతంత్య్రం రాకముందు దేశంలో జైళ్ల పరిస్థితి, పనితీరు.. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ఈ 76 ఏళ్లలో ఎలాంటి సంస్కరణలు జరిగాయి.. భవిష్యత్‌లో ఇంకెలాంటి సంస్కరణలు అమలు చేయాలి, ఏ విధంగా జైళ్లను ఆధునీకరించాలి తదితర అంశాలపై సుదీర్ఘ చర్చలు జరిగాయి. బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్(బీపీఆర్‌డీ), రాష్ట్ర జైళ్ల శాఖ సంయుక్తంగా 'అమృత్ కాల్' పేరుతో నిర్వహించిన ఈ సదస్సును సోమవారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అజయ్‌కుమార్ మిశ్రా ప్రారంభించిన విషయం తెలిసిందే. ముగింపు కార్యక్రమానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఖైదీలకు ప్రతీకారంతో కూడిన శిక్ష ఉండకూడదన్నారు. వారిలో పరివర్తనం తీసుకొచ్చేలా జైళ్ల శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ రాష్ట్రంలోని జైళ్లలో పటిష్టమైన భద్రత ఉందన్నారు. సంస్కరణలు అమలు చేయడంతో పాటు ఖైదీలు, సిబ్బంది కోసం అనేక సంక్షేమ చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం మంత్రితో కలిసి గవర్నర్ రాష్ట్ర జైళ్ల శాఖ ముద్రించిన బులిటెన్‌ను ఆవిష్కరించారు. బీపీఆర్‌డీ డీజీ బాలాజీ శ్రీ వాత్సవ్, ఏపీ డీజీ హరీష్‌కుమార్ గుప్తా, ఐజీ ఇండ్ల శ్రీనివాసరావు, అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని జైళ్ల శాఖ డీజీలు, ఐజీలు, కేంద్ర కారాగారాల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ఆరు అంశాలపై సుదీర్ఘ చర్చ

సదస్సులో భాగంగా జైళ్లలో సంస్కరణలు, సంక్షేమం, అభివృద్ధి, ఆధునీకరణ, ఖైదీల్లో పరివర్తనం కలిగించడం, వారితో స్నేహంగా మెలగడం, కౌన్సెలింగ్ తదితర అంశాలపై ప్రధాన వక్తలు మాట్లాడారు. అనంతరం అధికారులతో గ్రూపులను ఏర్పాటు చేసి.. ఆయా రాష్ట్రాల జైళ్లలో అమలు చేస్తున్న సంస్కరణలు, సంక్షేమం అభివృద్ధిపై చర్చించారు. రెండు రోజుల సదస్సులో ప్రధానంగా ఆరు అంశాలపై చర్చ జరిగింది. టెక్నాలజీ ఇన్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్, స్టేటస్ ఆఫ్ మెంటల్ హెల్త్ ఇన్ ప్రిజన్స్ ఇన్ ఇండియా, మోడల్ ప్రిజన్స్ లెజిస్లేషన్, డీ అడిషన్ ఆఫ్ ప్రిజనర్స్, ఓవర్ ప్రిజన్స్, అల్టర్నేటివ్స్ టు ఇన్‌కార్సనేషన్ అనే ఆరు అంశాలపై సుదీర్ఘ చర్చ జరిగింది. చర్చించిన అంశాలతో రాష్ట్ర జైళ్ల అధికారులు ఓ నివేదిక సిద్ధం చేసి, బీపీఆర్‌డీతో పాటు అన్ని రాష్ట్రాల జైళ్ల శాఖ అధికారులకు సమర్పిస్తారు.

ఆకర్షణగా ఖైదీల ఉత్పత్తులు

రాష్ట్రంలోని జైళ్లతో పాటు తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్నాటక, గుజరాత్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల జైళ్లలో ఖైదీలు తయారు చేసిన పలు వస్తువులను ఇక్కడ ప్రదర్శించారు. ఈ ఉత్పత్తులను అధికారులు పరిశీలించారు. ఉత్తరాఖండ్ జైలులో ఖైదీలు తయారు చేసిన రూ.1,100 విలువ గల దుప్పి పెయింటింగ్, ఉత్తరప్రదేశ్ జైలులో ఖైదీలు రూపొందించిన రూ.900 విలువ గల కుక్క కార్పెట్ అధికారులను ఆకట్టుకుంది. దుస్తులు, చెక్క బొమ్మలు, కార్పెట్లు, ఫినాయిల్ తదితర వస్తువులను ఇక్కడ ప్రదర్శించారు.

గవర్నర్‌కు ఆత్మీయ వీడ్కోలు

మహారాణిపేట: గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ నాలుగు రోజుల జిల్లా పర్యటన మంగళవారంతో ముగిసింది. మంగళవారం సాయంత్రం గవర్నర్ విజయవాడకు తిరిగి పయనమయ్యారు. కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, ఇతర అధికారులు గవర్నర్‌కు విశాఖ విమానాశ్రయంలో ఆత్మీయ వీడ్కోలు పలికారు.

మర్యాదతో మరింత ఆదరణ

- డ్రైవర్లు, కండక్టర్లకు నిపుణులతో కౌన్సెలింగ్
- వారంలో ఒక రోజు జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీలో నిర్వహణ
- ఫిర్యాదుల నేపథ్యంలో ఆర్టీసీ ఉన్నతాధికారుల చర్యలు



కండక్టర్లు, డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డిప్యూటీ సీటీఎం అప్పలనాయుడు

సాక్షి, విశాఖపట్నం: ప్రయాణికుల పట్ల సిబ్బంది మర్యాదగా వ్యవహరించడంపై ఆర్టీసీ అధికారులు ఫోకస్ పెడుతున్నారు. పాసింజర్ల మన్ననలు పొందడానికి ప్రాధాన్యమిస్తున్నారు. ఇందుకోసం ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారి పట్ల కొంతమంది డ్రైవర్లు, కండక్టర్లు దురుసుగా ప్రవర్తిస్తున్నారని, ఏకవచనంతో సంబోధిస్తున్నారని, బస్సులు సక్రమంగా ఆపడం లేదని, దురుసుగా సమాధానం చెబుతున్నారని.. ఇలా పలు ఫిర్యాదులు ఆర్టీసీ కంప్లయింట్ సెల్‌కు అందుతున్నాయి. ఈ ఫిర్యాదులను ఆర్టీసీ యాజమాన్యం సీరియస్‌గా తీసుకుంది. ఇకపై కండక్టర్లు, డ్రైవర్లు ప్రయాణికులతో మర్యాదగా మెలిగేలా చర్యలు చేపట్టింది. ఇందుకోసం కంప్లెయింట్ సెల్‌కు అందిన ఫిర్యాదుల ఆధారంగా సంబంధిత కండక్టర్లు, డ్రైవర్లకు ప్రతి మంగళవారం కౌన్సెలింగ్ ఇవ్వాలని నిర్ణయించింది. ఆర్టీసీ జోన్-1కు సంబంధించి ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఈ కండక్టర్లు, డ్రైవర్లకు విజయనగరం జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీలో కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఈ ప్రక్రియకు మంగళవారం నుంచే శ్రీకారం చుట్టారు. ఉదయం రెండు గంటలు, మధ్యాహ్నం రెండు గంటల చొప్పున ఆర్టీసీలో ఎంపిక చేసిన అధికారులతో పాటు బయట నుంచి నిపుణులు, లెక్చరర్లు, అడ్వకేట్లను కూడా రప్పించి వారితో సుహృద్భావ వాతావరణంలో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులతో మర్యాద పూర్వకంగా మెలగాలని, వారు అడిగిన ప్రశ్నలు, సందేహాలకు దురుసుగా కాకుండా సామరస్యంగా సమాధానం చెప్పాలని, చిరాకు ప్రదర్శించకుండా మాట తీరు గౌరవప్రదంగా ఉండాలని, వారిని ఏకవచనంతో సంబోధించవద్దని, ప్రయాణికుల మన్ననలు పొందాలని సూచిస్తున్నారు. ఈ కౌన్సెలింగ్ ద్వారా వీరి ప్రవర్తనలో మార్పు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్ల వ్యవహారశైలి ప్రయాణికులపై ప్రభావం చూపుతుందన్న భావనకు అధికార్లు వచ్చారు. కౌన్సెలింగ్ ద్వారా వీరు ప్రయాణికులతో స్నేహపూర్వకంగా మెలిగితే ఆర్టీసీపై ప్రయాణికుల ఆదరణ మరింత పెరుగుతుందని, ప్రైవేటు ఆపరేటర్ల వైపు మళ్లే అవకాశం ఉండదని వీరు భావిస్తున్నారు.

నిరంతరం కొనసాగిస్తాం



ప్రయాణికులతో కండక్టర్లు, డ్రైవర్లు మర్యాదగా వ్యవహరించడం వల్ల ఆర్టీసీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతుంది. దీంతో ప్రయాణికుల ఆక్యుపెన్సీ రేషియో పెరిగి ఆర్టీసీ ఆదాయం వృద్ధి చెందడానికి కూడా దోహదపడుతుంది. కంప్లయింట్ సెల్‌కు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా సంబంధిత సిబ్బందికి బ్యాచ్‌కు 10–15 మంది చొప్పున ఎంపిక చేసి నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నాం. దీనిని నిరంతరం కొనసాగిస్తాం.

– సి.రవికుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జోన్-1

వలకు చిక్కిన సీ హార్స్!



సాక్షి, విశాఖపట్నం: అత్యంత అరుదైన సీ హార్స్ మత్స్యకారుల వలలకు చిక్కుతున్నాయి. విశాఖ తీరంలో అప్పుడప్పుడు ఇవి దర్శనమిస్తున్నాయి. ఇవి రెండు మూడు అంగుళాల సైజులో రొయ్యలను పోలి ఉంటాయి. ఇవి రొయ్యల్లో కలిసిపోతుండడం వల్ల మత్స్యకారులు వీటిని పెద్దగా పట్టించుకోరు. తాజాగా మంగళవారం విశాఖ మత్స్యకారుల వలకు ఇవి దొరికాయి. నగరంలోని ఒక వ్యక్తి సాయంత్రం హార్బర్‌లో రొయ్యలను కొనుగోలు చేశాడు. ఇంటికి తెచ్చి చూడగా రొయ్యలతో పాటు ఈ సీ హార్స్ కూడా అందులో ఉన్నట్టు కె.విజయ్‌కుమార్ అనే వ్యక్తి గుర్తించారు. దొరికిన సీ హార్స్‌ను తన వాట్సాప్ స్టేటస్‌లో పెట్టడంతో ఈ విషయం బయట పడింది. కాగా సముద్ర గుర్రంగా పిలిచే ఈ చిన్న చేపలు (సీ హార్స్) ప్రపంచ వ్యాప్తంగా ఉష్ణమండల, సమశీతోష్ణ జలాల్లో కనిపిస్తాయి. వీటికి వంకర మెడలు, పొడవైన గొంతు, తల, శరీరం నిటారుగా ఉండి తోక వంకరగా ఉంటుంది. ఈ జంతువులకు నోట్లో పళ్లుండవు. పగడపు దిబ్బలు, మడ అడవులు వంటి ప్రాంతాల్లో నివశిస్తాయి. నిట్టనిలువుగా నిలిచి ఈదుతాయి. మగ సముద్రపు గుర్రాలు తమ శరీరం ముందు భాగంలో సంతానాన్ని పొదగడానికి అనువైన ఒక సంచి వంటి అరను కలిగి ఉంటాయి. జతకట్టే సమయంలో ఆడ చేప గుడ్లను ఈ మగ చేప సంచిలోకి విడుస్తుంది. అప్పుడు మగ చేప వాటిని అంతర్గతంగా ఫలదీకరణ చేసి పిల్లలు గుడ్లలో నుంచి బయటకు వచ్చాక వాటిని నీటిలోకి విడుదల చేస్తుందని మత్స్యశాఖ జిల్లా అధికారి జి.విజయ 'సాక్షి'కి చెప్పారు. విశాఖ ప్రాంత సముద్ర జలాల్లో సీ హార్స్‌ల ఉనికి అరుదు అని తెలిపారు.

తప్పు చేస్తే శిక్ష తప్పదనే భయం ఉండాలి

- వివక్షను రూపుమాపేందుకే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం
- ఎస్టీ కమిషన్ చైర్మన్ డి.వి.జి.శంకరరావు



మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు

సీతమ్మధార: సమాజంలో నెలకొన్న వివక్షను రూపుమాపడానికి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని తీసుకొచ్చిందని ఎస్టీ కమిషన్ చైర్మన్ డి.వి.జి.శంకరరావు అన్నారు. సీతమ్మధారలోని ఓ కల్యాణ మండపంలో ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ సెల్, సీఐడీ సంయుక్తంగా 'ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలు, వారిపై జరుగుతున్న దాడులు, నివారణ' అంశంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించాయి. డీఎల్ఎస్ఏ చైర్‌పర్సన్, జడ్జి ఎం.వి.శేషమ్మ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ సదస్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగం స్ఫూర్తితో చట్టాలను అమలు చేయాలన్నారు. బలహీన వర్గాలు ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాధితుల హక్కులను వివరించారు. ఎస్టీ కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం పౌరులందరికీ సమాన హక్కులను కల్పించిందన్నారు. బలహీన వర్గాల వారు తమని తాము రక్షించుకోవడం కోసం ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. సమాజంలో అన్ని వర్గాల మనుషులు ఉంటారని.. తప్పు చేస్తే శిక్ష తప్పదనే భయం నెలకొన్నప్పుడు వివక్షకు తావుండదన్నారు. ఆ దిశగా న్యాయవాదులు, పోలీసులు, ఇతర శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. ఎస్పీ(మంగళగిరి) అనిల్ కుమార్ మాట్లాడుతూ విచారణ అధికారి పారదర్శకంగా వ్యవహరించినప్పుడు బాధితులకు సరైన న్యాయం దక్కుతుందన్నారు. కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు స్వేచ్ఛ ఇవ్వాలని కోరారు. సీఐడీ రీజినల్ అధికారి పి.వి.ఆర్.ఎస్.ఎస్.ఎం.వి.ఆర్ వర్మ అధ్యక్షతన జరిగిన సదస్సులో డీఎస్పీ ఎస్. భూపాల్, ఎస్సీ, ఎస్టీ కోర్టు పీపీ బి.వి.రమణమూర్తి, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రామారావు, విజిలెన్స్ మోనిటరింగ్ సెల్ సభ్యులు పి.మల్లేశ్వరరావు, ఎస్సీ, ఎస్టీ సెల్ ఏసీపీ ఎస్.బాపూజీ, గణపతి వాసవ్య మహిళా సంఘం ప్రతినిధి ఆర్.మాధవి గణపతి, ఎన్‌బీఎం లా కళాశాల ప్రిన్సిపాల్ బి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల పిల్లలకు ఉపకార వేతనాలు

నవంబర్ 15 వరకు దరఖాస్తుల స్వీకరణ

మహారాణిపేట: ప్రధానమంత్రి ఉపకార వేతనాల కోసం మాజీ సైనికుల పిల్లలు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా సైనిక సంక్షేమాధికారి జి.సత్యానందం కోరారు. 2023–24 విద్యా సంవత్సరంలో సాంకేతిక, వృత్తి విద్యా కోర్సుల్లో చేరిన విద్యార్థులు మాత్రమే అర్హులు. ఇంటర్‌లో 60 శాతం మార్కులు పొంది ఉండాలి. బాలురకు రూ.30 వేలు, బాలికలకు రూ.36 వేల చొప్పున ఉపకార వేతనాలు అందిస్తారు. విద్యార్థులు నవంబర్ 15వ తేదీలోగా www.ksb.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని ఓ ప్రకటనలో సత్యానందం వివరించారు.

ఏయూలో యానిమల్ హౌస్ ఏర్పాటు

ఒప్పందం చేసుకున్న రొడెంటా బయో సర్వ్



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న రెండు సంస్థల ప్రతినిధులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో శాస్త్రీయ పరిశోధనలకు ఉపయుక్తంగా యానిమల్ హౌస్ ఏర్పాటు కానుంది. ఇందుకు సంబంధించి హైదరాబాద్‌కి చెందిన రొడెంటా బయోసర్వ్ సంస్థ ఏయూతో అవగాహన ఒప్పందం చేసుకుంది. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సమక్షంలో మంగళవారం రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, రొడెంటా సంస్థ చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ డాక్టర్ కె.ఆనంద్ కుమార్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. వర్సిటీలో ఫార్మసీ, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, జువాలజీతో పాటు జీవశాస్త్ర కోర్సులు అభ్యసించే పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు ఉపయుక్తంగా దీనిని ఏర్పాటు చేస్తున్నారు. ఏయూలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎలిమెంట్ భవనానికి అనుసంధానంగా.. నెల రోజుల్లో ఈ కేంద్రం పూర్తిస్థాయిలో సేవలు ప్రారంభించనుంది. ఈ సందర్భంగా డాక్టర్ కె.ఆనంద్ కుమార్ మాట్లాడుతూ నగరంలోని వివిధ పరిశ్రమల అవసరాలు తీర్చుతూ ఆదాయ వనరుగా ఈ కేంద్రం నిలుస్తుందన్నారు. ఏయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ వై.రాజేంద్ర ప్రసాద్, డీన్ కె.బసవయ్య, ఈశ్వర కుమార్, గిరిజా శంకర్, శైలజ, మురళీకృష్ణ కుమార్ పాల్గొన్నారు.

ఏం కష్టమొచ్చిందో..?

- వ్యవసాయ బావిలో దూకి కుమార్తెతో కలిసి దంపతుల ఆత్మహత్య
- కొత్తవలస మండలం చింతలపాలెం సమీపంలో ఘటన
- మృతులు విశాఖపట్నం జిల్లా మద్రిపాలెం వాసులుగా గుర్తింపు



బావిలో తేలియాడుతున్న మృతదేహాలు



మొహిసుద్దీన్, నిషా, జహీదా (ఫైల్)

కొత్తవలస(విజయనగరం జిల్లా): ఆ కుటుంబానికి ఏం కష్టమొచ్చిందో తెలియదు. ఆరోగ్యం, ఆర్థికంగా బాగానే ఉన్నా... ఊరు కాని ఊరు వచ్చి కుమార్తెతో కలిసి దంపతులిద్దరూ ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన విజయనగరం జిల్లా కొత్తవలస మండలం చింతలపాలెం గ్రామ సమీపంలో మంగళవారం చోటుచేసుకోంది. పోలీసులు, స్థానికులు, మృతుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖలోని ఓ షిప్పింగ్ కంపెనీలో ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న మహ్మద్ మొహిసుద్దీన్ (46) మద్రిపాలెం సమీపంలో ఎఫ్‌సీఐ కాలనీలో ఉంటున్నాడు. అతడికి భార్య సంషినిషా (38), కూతురు ఫాతిమా జహీదా (17), కుమారుడు మహ్మద్ ఆలీ ఉన్నారు. అతడు విజయనగరం జిల్లా కొత్తవలస మండలం చింతలపాలెం గ్రామ సమీపంలో గతంలో కొంత భూమి కొనుగోలు చేశాడు. ఆ భూమిని చూసేందుకు దంపతులిద్దరూ, కుమార్తె క్యాబ్ బుక్ చేసుకొని ఇంటి నుంచి సోమవారం వచ్చారు. సాయంత్రం వరకు ఆ ప్రాంతంలో తిరిగారు. ఇంతలో ఏమైందో గానీ ముగ్గురూ గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలోదూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. బావిగట్టుపై మృతుడికి చెందిన సెల్‌ఫోన్, తమ బంధువులకు సంబంధించిన ఫోన్ నంబర్లు రాసిన కాగితం, ఇతర వస్తువులు ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. బావిలోకి చూడగా మృతదేహాలు తేలియాడడం గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో సీఐ ఎస్.చంద్రశేఖర్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ దొరికిన ఆధారాలతో ఫోన్ చేసి మృతుడు మొహిసుద్దీన్ కొడుకు మహ్మద్ ఆలీకి సమాచారం అందించారు. మృతుల కటుంబ సభ్యులు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకొని మృతులను గుర్తించారు. ఆలీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించినట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. మృతురాలు జహీదా విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. కొడుకు ఆలీ ఎంబీఏ చదువుతున్నాడు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ

ఘటనా స్థలాన్ని విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు సందర్శించారు. క్లూస్ టీమ్‌తో క్షుణ్ణంగా పరిశీలించారు. అన్ని కోణాల్లోనూ పరిశీలిస్తున్నట్టు ఆయన తెలిపారు. మృతుల సెల్‌ఫోన్‌లను ఓపెన్ చేసి కాల్‌డేటాను సేకరిస్తున్నట్టు డీఎస్పీ తెలిపారు. కాల్ డేటా సేకరిస్తే ఆత్మహత్యకు గల కారణాలు తెలిసే అవకాశం ఉంటుందన్నారు.

ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

గోపాలపట్నం: కొత్తవలస మండలం చింతలపాలెం గ్రామ సమీపంలో కుమార్తెతో కలిసి దంపతులిద్దరూ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనతో మద్రిపాలెం ఎఫ్‌సీఐ కాలనీలో విషాదం నెలకొంది. సోమవారం ఉదయం వెళ్లిన తల్లిదండ్రులు చెల్లి ఎంతకీ రాకపోవడంతో కుమారుడు మహ్మద్ ఆలీ ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇంతలో ముగ్గురు మృతి చెందిన వార్త తెలియడంతో కుమారుడు, బంధువులు, స్థానికులు కన్నీరుమున్నీరయ్యారు. ఉదయం వరకు సరదాగా ఉన్న వాళ్లు ఎందుకు ఇంత పనిచేశారంటూ గుండెలవిసేలా రోదించారు.

అప్పులే కారణమా...?

గతంలో షిప్పింగ్ కంపెనీలో పనిచేసిన మొహిసుద్దీన్ కొన్నాళ్లగా సొంతంగా కాంట్రాక్ట్ పనులు చేపడుతున్నాడు. దీంతో కొంతమేరకు అప్పుల పాలైనట్లు సమాచారం. ఆత్మహ్యతకు ఇది కారణం కావచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

ఆంధ్రప్రదేశ్
ANDHRA PRADESH
AP Pollution Control Board

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం ..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా
రవీంద్రభారతి స్కూల్,
ద్వారకానగర్ ఫస్ట్ లైన్, విశాఖపట్నం
తేదీ : 16-09-2023
సమయం : ఉ. 9.30 నుంచి
మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించాల్సిన
ఫోన్ నంబరు : 70757 09205

15న మెగా జాబ్‌మేళా



కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈ నెల 15న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్), కె.శాంతి(టెక్నికల్) తెలిపారు. టెక్నోసాఫ్ట్ సొల్యూషన్స్, వోల్టా ప్యాషన్స్, ఏడీఎల్ ఆగ్రో పార్క్, శ్రీరామ్ ఫైనాన్స్, రిలయన్స్ జియో, వరుణ్ మోటర్స్, టీం లీజ్, యూనియన్ బ్యాంక్, రెడ్డీస్ లేబొరేటరీస్, బిగ్‌బాస్కెట్, సెవెన్ హిల్స్ హెల్త్ కేర్ తదితర కంపెనీల్లో 873 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. అసోసియేట్ ఏజెన్సీ, సూయింగ్ మిషన్ ఆపరేటర్, బిల్లింగ్, కస్టమర్ అండ్ ఫీల్డ్ ట్రైనీ, సేల్స్ డెవలప్‌మెంట్ మేనేజర్, ఫార్మాసిస్ట్, అసెంబ్లీ ఆపరేటింగ్ కాల్ అసిస్టెంట్, ఆపరేటర్, కస్టమర్ ఎగ్జిక్యూటివ్, కెమిస్ట్, క్యాషియర్, డెలివరీ ఎగ్జిక్యూటివ్స్, డ్యూటీ మెడికల్ ఆఫీసర్, వేర్ హౌస్ అసోసియేట్స్, టీం లీడర్స్, స్టాఫ్ నర్స్, ఇన్‌చార్జి నర్స్, అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్, కేర్ టేకర్స్, కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలకు ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, బీఎస్సీ నర్సింగ్, పీజీ, ఐటీఐ, డిప్లమా, బీటెక్, ఎంబీఏ పూర్తి చేసిన వారు అర్హులు. ఆసక్తి ఉన్న 18–35 ఏళ్ల పురుష, మహిళా అభ్యర్థులు https:// www.ncs.gov.in/లో పేర్లు నమోదు చేసుకుని ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చు.

రేపు ఉపాధి కార్యాలయంలో..

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈ నెల 14న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా సబ్ రీజినల్ ఎంప్లాయిమెంట్ అధికారి నిట్టాల శ్యామ్ సుందర్ తెలిపారు. కల్యాణ్ జ్యువెలర్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీలో 50 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించి 18–35 ఏళ్ల పురుష, మహిళా అభ్యర్థులు అర్హులు. నెలకు జీతం రూ.16,400 ఉంటుంది. అభ్యర్థులు https://www.ncs.gov.in/లో పేర్లు నమోదు చేసుకుని ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

ప్రత్యామ్నాయ నీటి లభ్యతపై దృష్టి సారించాలి

సీఐఐ చైర్మన్ పీపీ లాల్‌కృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న సీఐఐ చైర్మన లాల్ కృష్ణ

తాటిచెట్లపాలెం : పరిశ్రమలు నీటి సామర్థ్యాన్ని పెంపొందించుకోడానికి తమ అంతర్గత విధానాలు, పద్ధతులను మెరుగుపరుచుకోవాలని సీఐఐ చైర్మన్ పీపీ లాల్ కృష్ణ తెలిపారు. ప్రాంతీయ నీటి వనరుల లభ్యత, వాటి సరఫరా అంశాలను కూడా పరిగణలోకి తీసుకోవాలన్నారు. సుస్థిరమైన అభివృద్ధి కోసం నీటి వినియోగ సామర్థ్యంపై సీఐఐ ఆధ్వర్యంలో మర్రిపాలెంలోని మారియట్ హోటల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక వ్యవస్థ పారిశ్రామికీకరణకు లోనవుతున్నందున, నీటి అవసరం పెరుగుతోందన్నారు. వివిధ ప్రక్రియల నుంచి ఉత్పన్నమయ్యే మురుగునీటిని తిరిగి ఉపయోగించడం, రీసైక్లింగ్ చేయడం, ఈ నీటిని ద్వితీయ పారిశ్రామిక కార్యకలాపాలకు వినియోగిస్తే నీటి కొరత తీరుతుందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో పోలిస్తే భారతీయ పరిశ్రమల్లో నీటి వినియోగం చాలా తక్కువగా ఉందన్నారు. సీఐఐ వాటర్ ఇన్‌స్టిట్యూట్ కౌన్సెలర్ అదితి హస్కర్ మాట్లాడుతూ భారతీయ పరిశ్రమల్లో నీటి కొరత తీవ్రంగా వేధిస్తోందన్నారు. సీఐఐ విశాఖపట్నం చాప్టర్ మాజీ చైర్మన్ కేవీవీ రాజు మాట్లాడుతూ పట్టణీకరణ అభివృద్ధి చెందుతున్నందున నగరాలను స్మార్ట్‌గా మార్చడం ఎంత అవసరమో నీటిని కూడా స్మార్ట్‌గా వినియోగించడం అంతే అవసరమన్నారు. ఎస్‌పీసీఎల్ ఏజీఎం చిన్న దురై తదితరులు మాట్లాడారు. సదస్సులో సీఐఐ, విశాఖపట్నం వైస్ చైర్మన్ రాజేష్ గ్రంధి, జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (ప్రాజెక్ట్స్) ప్రెసిడెంట్ ఎంవీ చారి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా సవరణ



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్, డీఆర్‌వో మోహన్‌కుమార్

మహారాణిపేట : ఓటరు జాబితా సవరణ–2024 కార్యక్రమాన్ని జిల్లాలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్నారు. మంగళవారం విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో ఓటరు జాబితా సవరణ–2024 కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. తొలగింపుల రీ–వెరిఫికేషన్, అనర్హుల ఓటర్లపై రాజకీయ పార్టీల ఫిర్యాదులు, ఫారం 6,7,8 పెండెన్సీ, ఇంటింటికి ఓటరు సర్వేలో తీసుకున్న చర్యలు, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, ఎపిక్ కార్డుల ముద్రణ, పంపిణీ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మల్లికార్జున జిల్లా ఓటర్లు జాబితా సవరణ-2024కు సంబంధించిన ప్రగతి వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. తొలగింపుల రీ–వెరిఫికేషన్ అనర్హుల ఓటర్లపై రాజకీయ పార్టీల ఫిర్యాదులు, ఫారం 6,7,8 పెండెన్సీ, ఇంటింటికి ఓటరు సర్వేలో తీసుకున్న చర్యల గురించి సీఈవోకు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ కె.ఎస్.విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, విశాఖ, భీమిలి ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కరరెడ్డి, ఈఆర్‌వోలు, ఏఆర్‌వోలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

అక్టోబర్ 23లోగా రైతులకు కన్వేయన్స్ డీడ్‌లు జారీ

కలెక్టర్ మల్లికార్జున



మహారాణిపేట: నవరత్నాలు–పేదలందరికీ ఇల్లు పథకంలో భాగంగా భూసమీకరణ (ఎల్‌పీఎస్) కింద భూములిచ్చిన రైతులకు అక్టోబర్ 23వ తేదీలోగా కన్వేయన్స్ డీడ్‌ల జారీ చేసేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం చేపట్టడానికి ప్రభుత్వం 2020లో భూ సేకరణ చేయడానికి నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో డి.పట్టాదారులు, ప్రభుత్వ భూములను ఆక్రమించిన అర్హులైన రైతులు సుమారు 4,900 ఎకరాలను స్వచ్ఛందంగా ప్రభుత్వానికి అందజేసినట్లు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. అయితే కొంత మంది ప్రైవేటు వ్యక్తులు హైకోర్టును ఆశ్రయించి స్టే పొందారు. 2022లో హైకోర్టు ఈ కేసులను కొట్టి వేయడంతో ఆ భూముల్లో లే అవుట్లను అభివృద్ధి చేయడానికి టెండర్లు ఖరారు చేశారు. కాగా.. భూములిచ్చిన రైతులకు వారు కోరుకున్న లే అవుట్‌లో ల్యాండ్ పూలింగ్ ఓనర్‌షిప్ సర్టిఫికెట్‌లను సంబంధిత కాంపిటెంట్ అథారిటీ ద్వారా మంజూరు చేశామని కలెక్టర్ వివరించారు. భూములిచ్చిన రైతులకు అభివృద్ధి పరిచిన ప్లాట్లను అందజేయడానికి.. 1,215 ఎకరాల్లో లేఅవుట్లను రూ.600 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ లే అవుట్లలో రోడ్లు, కాలువలు, తాగునీరు విద్యుత్, ఇతర మౌలిక వసతులను వచ్చే జనవరి నాటికి పూర్తి చేసేందుకు నిర్ణయించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ ప్లాట్లలో ఇల్లు నిర్మాణం, వారసులకు బదలాయింపు, రుణాల కోసం తనఖా, అమ్ముకోవడానికి పూర్తి హక్కులు ఉంటాయన్నారు.

వృద్ధురాలి మెడలో పుస్తెలతాడు చోరీ

- నిందితుడిని పట్టుకుని దేహశుద్ధి



నిందితుడు అమిత్‌రావు

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస కూడలిలో మంగళవారం కాగితాల(పిన్నింటి) బంగారమ్మ అనే వృద్ధురాలి మెడ నుంచి ఓ యువకుడు మూడు తులాల పుస్తెల తాడును అపహరించుకుపోయాడు. స్థానిక యువకులు అతన్ని వెంబడించి.. పట్టుకుని దేహశుద్ధి చేశారు. వివరాలివీ.. మజ్జివలస కళ్లాలకు చెందిన బాధితురాలు శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటలోని బ్యాంకు బీసీ పాయింట్‌లో డ్వాక్రా డబ్బులు చెల్లించేందుకు వెళ్లింది. తిరిగి మహరాజుపేట–పద్మనాభం రహదారిపై ఒంటరిగా నడుచుకుంటూ వస్తుండగా.. వెనుకనే ద్విచక్రవాహనంపై వచ్చిన యువకుడు అమిత్‌రావు బలవంతంగా ఆమె మెడ నుంచి తాడు అపహరించుకుని వెళ్లిపోయాడు. ఇది గమనించిన రాస పోలమాంబ కూడలి వద్ద ఉన్న యువకులు తమ ద్విచక్ర వాహనాలపై నిందితుడిని వెంబడించారు. మజ్జివలస ఆంజనేయ స్వామి ఆలయం వద్ద చిక్కినట్టే చిక్కి వెళ్లిపోయాడు. సినీ ఫక్కీలో వెంటాడగా పద్మనాభం మండలంలోని కురపల్లి వద్ద వీరికి పట్టుబడటంతో దేహశుద్ధి చేశారు. తొలుత నిందితుడిని పద్మనాభం పోలీస్ స్టేషన్‌కు తరలించగా ఘటన భీమిలి పరిధిలో జరగడంతో అక్కడి స్టేషన్‌కు తరలించారు. నిందితుడిది విజయనగరం జిల్లా ఎస్.కోట వద్ద కొమరాం. భీమిలి పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఆ వార్తలు పూర్తి అవాస్తవం

- యాదవ సామాజిక వర్గాన్ని కించపరిచేలా మాట్లాడలేదు
- జిల్లా ఎస్సీ సెల్ విభాగం జనరల్ సెక్రటరీ రాజాబాబు

కొమ్మాది: యాదవ సామాజికవర్గంపై తాను ఆరోపణలు చేసినట్లు కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తలు పూర్తిగా అవాస్తవమని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ విభాగం జిల్లా జనరల్ సెక్రటరీ అల్లంపల్లి రాజాబాబు అన్నారు. ఎండాడలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులతో కలిసి మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వాసవానిపాలెంలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణతో కలసి సోమవారం ఓ శంకుస్థాపన కార్యక్రమానికి వెళ్లానని చెప్పారు. అక్కడ మాట్లాడుతూ మూడు సార్లు వెలగపూడికి అవకాశం ఇచ్చామని.. ఈ సారి ఎంవీవీకి అవకాశం ఇవ్వాలని అన్నానే తప్ప.. యాదవ సామాజిక వర్గాన్ని ఎక్కడా కించపరిచేలా మాట్లాడలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యాదవ సామాజికవర్గానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని గుర్తు చేశారు.

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	510.00
విజయనగరం	514.00
శ్రీకాకుళం	514.00

దంతేవాడ వరకే కిరండూల్ రైళ్లు

తాటిచెట్లపాలెం: భద్రతా కారణాల వల్ల కొత్తవలస–కిరండూల్ లైన్‌లో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో గమ్యం కుదించడంతోపాటు దంతేవాడ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తాయని వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. విశాఖపట్నం– కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 18వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్–విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 19వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. విశాఖపట్నం–కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ ఈ నెల 19వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్–విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ రైలు ఈ నెల 20వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

కొల్లాం రైలుకు డివైన్ నగర్‌లో తాత్కాలిక హాల్ట్

విశాఖపట్నం–కొల్లాం–విశాఖపట్నం వీక్లీ రైలుకు ఆయా తేదీల నుంచి డివైన్ నగర్‌లో ఒక నిమిషం తాత్కాలిక హాల్ట్‌ను కల్పిస్తున్నట్లు త్రిపాఠి తెలిపారు. అక్టోబరు 12వ తేదీ నుంచి విశాఖపట్నం–కొల్లాం (18567) వీక్లీ స్పెషల్ రైలు డివైన్ నగర్‌లో ఆగుతుంది. ఈ రైలు మరుసటిరోజు ఉదయం 8.15 గంటలకు డివైన్ నగర్ చేరుకుని, అక్కడ నుంచి 8.16గంటలకు బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో అక్టోబరు 20వ తేదీ నుంచి కొల్లాం–విశాఖపట్నం (18568) ఎక్స్‌ప్రెస్‌కు డివైన్ నగర్‌లో హాల్ట్ కల్పించారు. ఈ రైలు అదే రోజు రాత్రి 11.45 గంటలకు డివైన్ నగర్ చేరుకుని, అక్కడ నుంచి 11.46 గంలకు బయల్దేరుతుంది.

వాతావరణంలో మార్పులపై అవగాహన



సమావేశంలో పాల్గొన్న ప్రొఫెసర్లు, విద్యార్థులు, ఎన్జీవో ప్రతినిధులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం పట్టణ వాతావరణంలో కలిగే మార్పులపై అవగాహన సదస్సు జరిగింది. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సూచనల మేరకు జీవీఎంసీ, ఎస్‌ఆర్‌యూ, ఎస్‌ఐపీఏ సంయుక్తంగా సమావేశం నిర్వహించాయి. వాతావరణ ప్రభావాలు ముందుగా గుర్తించి, ఆయా ప్రాంతాలను విపత్తుల నుంచి సురక్షితంగా ఉంచడమే ఈ సమావేశ ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్ ఎంపిక చేసిన నగరాల్లో కొచ్చి, భువనేశ్వర్, సూరత్, పుణె, విశాఖపట్నం ఉందన్నారు. ప్రాథమిక దశ నుంచే వాతావరణ ప్రభావంపై విద్యార్థులకు బోధించడం, సముద్ర తీర ప్రాంతంలోని మత్స్యకారులు, నగర ప్రజలకు అవగాహన కల్పించాలని తీర్మానించారు. ఏయూ అధ్యాపకులు, ఎన్జీవోస్, ఇండియన్ మెట్రాజికల్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొని పలు అంశాలు చర్చించారు.



బడిలో ఆటల సందడి

- నేటి నుంచి మండల స్థాయి క్రీడాపోటీలు
- 21 నుంచి నియోజకవర్గ స్థాయి పోటీలు

విశాఖ విద్య: జిల్లాలోని ప్రభుత్వ, గుర్తింపు పొందిన పాఠశాలల్లో బుధవారం నుంచి ఈ నెల 15 వరకు మండల స్థాయి పోటీల నిర్వహణకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అంతా సిద్ధం చేశారు. మండల స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు ఈ నెల 21 నుంచి 23 వరకు నియోజకవర్గ స్థాయిలో పోటీలు నిర్వహించనున్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ విషయంలో తగిన శ్రద్ధ తీసుకొని పోటీలు నిర్వహించాలని డీఈవో ఎల్.చంద్రకళ ఆదేశించారు. కబడ్డీ, వాలీబాల్, టెన్నీ కాయిట్, ఖోఖో, త్రో బాల్, బాల్ బ్యాడ్మింటన్, బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు మండల కేంద్రాల్లో నిర్ణయించిన క్రీడా ప్రాంగణాల్లో నిర్వహించనున్నారు. మరికొన్ని పోటీలను ఈ నెల 16 నుంచి అక్టోబర్ 13 వరకు ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన నిర్వహించేలా షెడ్యూల్ ఖరారు చేసినట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు తెలిపారు. అండర్–14, అండర్ –17 కేటగిరీలో నిర్వహించే పోటీల్లో ఆసక్తి గల విద్యార్థులంతా పాల్గొనేలా పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు శ్రద్ధ తీసుకోవాలని డీఈవో సూచించారు. మండల, నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ చూపే క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారు.

గంజాయి తైలంతో ముగ్గురి అరెస్ట్

అల్లిపురం: గంజాయి తైలం కలిగి ఉన్న ముగ్గురిని టాస్క్‌ఫోర్స్, టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 2 లీటర్ల గంజాయి తైలం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వివరాలివీ.. ఆర్టీసీ కాంప్లెక్స్ దరి సెంట్రల్ పార్కు వద్ద గంజాయి తైలం రవాణా చేస్తున్నారనే సమాచారంతో మంగళవారం టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.త్రినాథరావు, టూటౌన్ పోలీసులు, టాస్క్‌ఫోర్సు సిబ్బంది తనిఖీలు చేపట్టారు. అనుమానంగా తిరుగుతున్న అల్లూరి సీతారామరాజు జిల్లా కుడుములకు చెందిన రూడ చంటిబాబు, మొండిగెడ్డకు చెందిన కొండేముల కృష్ణారావు, వమ్ము గెడ్డకు చెందిన సాగిన అచ్యుత్‌లను అదుపులోకి తీసుకుని విచారించారు. వారి నుంచి గంజాయి తైలాన్ని స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ త్రినాథరావు తెలిపారు.

ఎయిర్‌పోర్టులో టీడీపీ కార్యకర్త హల్‌చల్




కిశోర్‌ను అదుపులోకి తీసుకుని ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

గోపాలపట్నం: హైదరాబాద్ నుంచి ఇండిగో విమానంలో మంగళవారం విశాఖ వచ్చిన టీడీపీ కార్యకర్త ఆడారి కిశోర్‌కుమార్ ఎయిర్‌పోర్టు వద్ద హల్‌చల్ చేశారు. చంద్రబాబు అరెస్ట్‌ను ఖండిస్తున్నట్లు ప్లకార్డులు ప్రదర్శించాడు. విమానంలో కూడా ప్లకార్డులు ప్రదర్శిస్తూ హడావిడి చేశాడు. విమానం దిగి బయటకు వచ్చిన ప్రయాణికులు కిశోర్ తీరుతో ఇబ్బందులు పడ్డారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ వచ్చే సమయం కావడంతో ఆయన కాన్వాయ్ ముందు ప్లకార్డు ప్రదర్శించేందుకు అతను యత్నించాడు. దీంతో ఎయిర్‌పోర్టు పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

పోలీస్ జిమ్ ప్రారంభం

అల్లిపురం: ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్స్ ఆవరణలో ఆధునీకరించిన పోలీస్ జిమ్‌తో పాటు పోలీస్ కమిషనర్ కార్యాలయం సెల్లార్‌లో నూతనంగా నిర్మించిన డైనింగ్ రూమ్‌ను మంగళవారం సీపీ డాక్టర్ సీఎం త్రివిక్రమ్‌వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిమ్ ఆధునీకీకరణకు సహకరించిన కోరమండల్, సీఎంఆర్ గ్రూప్ సంస్థలకు నగర పోలీస్ శాఖ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. పోలీస్ అధికారులు, సిబ్బంది శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలనే ఉద్దేశంతో పోలీస్ జిమ్‌ను ఆధునీకీకరించినట్లు వివరించారు. శాంతిభద్రతల డీసీపీ–1 వి.విద్యాసాగర్ నాయుడు, డీసీపీ–2 కె.ఆనందరెడ్డి, క్రైం డీసీపీ జి.నాగన్న, ఏడీసీపీ అడ్మిన్ ఎం.ఆర్.కె.రాజు, ఎస్బీ ఏడీసీపీ ఈ.నాగేంద్రుడు, ఏఆర్ ఏడీసీపీ కె.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఆరిలోవ: సీతకొండ బీచ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం పోలీసులు గుర్తించారు. అతనికి సుమారు 45 ఏళ్లు ఉంటుంది. అతని జేబులో ఓ లాడ్జీ రూం తాళం, కొన్ని పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, డబ్బులు, క్రెడిట్ కార్డు ఉన్నాయి. అలాగే తెలంగాణ రాష్ట్రం నారాయణఖేడ్ నుంచి నిజామాబాద్ బస్ టికెట్ ఉంది. దీంతో ఆయన తెలంగాణకు చెందిన వ్యక్తి అయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని కేజీహెచ్ పోస్టుమార్టం హాల్‌కు తరలించి భద్రపరిచారు. అతని వివరాలు తెలిస్తే తమను సంప్రదించాలని ఆరిలోవ సీఐ సోమశేఖర్ కోరారు.

అడవిని నాశనం చేస్తోంది కార్పొరేట్ శక్తులే..!

ఏఐకేఎంకేఎస్ బహిరంగ సభలో వక్తల ఉద్ఘాటన



వివిధ సంఘాల నాయకుల సంఘీభావం

డాబాగార్డెన్స్ : అడవిని నాశనం చేస్తోంది ఆదివాసులు కాదని, సామ్రాజ్యవాద కార్పొరేట్ శక్తులేనని ఏఐకేఎంకేఎస్ బహిరంగ సభలో పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. అఖిలభారత ఆదివాసీ సదస్సు సందర్భంగా ఏఐకేఎమ్‌కేఎస్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మహిళా కళాశాలకు ఎదురుగా నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. ఆదివాసీల ప్రదర్శనకు అనుమతి నిరాకరించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.వర్మ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు గుర్రం విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికలు జరగబోతున్న వేళ..ఆదివాసుల మనుగడ ప్రశ్నార్థకం చేసే అటవీ సంరక్షణ చట్టానికి సవరణలు చేయడాన్ని బరితెగించిన చర్యగా పేర్కొన్నారు. ఎవరికివారు విడివిడిగా పోరాటం చేయడం కాకుండా ఆదివాసులు, కార్మికులు, రైతాంగం అందరూ కలిసికట్టుగా పోరాటం చేయడం ద్వారానే ఈ విధానాలను ఓడించగలుగుతామన్నారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య మాట్లాడుతూ పోడు వ్యవసాయం ద్వారా అడవి నాశనమవుతోందన్నారు. పోడు చేసిన చోట తిరిగి సహజంగా అడవి పెరుగుతుందనే వాస్తవాన్ని వివరించారు. ఏఐకేఎంఎస్ కో కన్వీనర్, రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ 15 ఏళ్లలో ఏడు లక్షల 50 వేల ఎకరాల అటవీ భూములను అటవీయేతర కార్యక్రమాలకు పాలకులు కేటాయించారని, 9 లక్షల ఎకరాల అటవీ భూములుల దురాక్రమణకు గురయ్యారని పేర్కొన్నారు. ఏఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కిషోర్‌బాబు మాట్లాడుతూ ప్రజల ప్రధాన జీవన సమస్యలపై గాక పాలకులు ఇతర అంశాలపైకి ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారని ఆరోపించారు. ఏఐఎఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి గణేష్‌పాండా మాట్లాడుతూ హక్కులు కాలరాసే 4 లేబర్ కోర్టులకు వ్యతిరేకంగా విశాఖ స్టీల్ పరిశ్రమ ప్రవేటీకరణకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమం సాగాలన్నారు. కార్యక్రమంలో వేట్ల విజయ, కొంచెం రామారావు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ మహిళా కళాకారులు నిర్వహించిన డప్పుల నృత్యం, ప్రజా కళాకారుల జనం పాటలు ఆకర్షించాయి.

అటవీ సంరక్షణ చట్ట సవరణ రద్దు చేయాలి

ముందుగా రైల్వేన్యూకాలనీలోని సుబ్బలక్ష్మీ కల్యాణ మండపంలో నిర్వహించిన ప్రారంభోపన్యాసంలో ప్రముఖ పర్యావరణ ఉద్యమ నాయకుడు ప్రఫుల్లా సమంతరాయ్ మాట్లాడుతూ ఆదివాసీలకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల చేసిన అటవీ సంరక్షణ చట్ట సవరణ రద్దు చేయాలన్నారు. జీతం లేని సేవకులుగా అడవులను సంరక్షిస్తూ వచ్చిన ఆదివాసీలను గెంటివేసే కుట్రలు తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంకేఎస్ నాయకులు ప్రసాద్, రామిరెడ్డి, శంభు మహతో, బెంగాల్ ఆదివాసీ ఉద్యమనేత కాంతి ముండా, జల్‌జంగిల్ జమీన్ పాల్గొన్నారు.